నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: నాచారం పారిశ్రామికవాడలోని 33/11 కేవీ ఫీడర్ పరిధిలోని ఆదివారం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ ఫీడర్ల పరిధిలో విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11 కేవీ ఫీడర్లు చందమామ, దుర్గానగర్, ఆవురా, స్టాలిన్ టైర్స్, హరియాణా స్టీల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ మల్టీస్టీల్, భాగ్యనగర్, టెక్‌పార్క్ ఫీడర్ల పరిధిలోని విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ ప్రకటించారు.
ఉప్పల్‌లో.. 33/11 కేవీ ఏడీఏ ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు 11 కేవీ మెట్రో ఫీడర్, శ్రీ కృష్ణా ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. 11 కేవీ హైదరాబాద్ సెక్యూరిటీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు విద్యుత్ సరాఫరాకు అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని ఏఈ కిరణ్‌కుమార్ కోరారు.

అరోరా కళాశాలను సందర్శించిన న్యాక్ టీమ్



రామంతాపూర్ : గణేష్‌నగర్‌లోని అరోరా అటానమస్ పీజీ కళాశాలలో గత రెండ్రోజులు శుక్రవారం నుంచి శనివారం వరకు న్యాక్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ రవీంద్రసింగ్, కో– ఆర్డినేటర్ ప్రొఫెసర్ కె.రమేష్ , సభ్యుడు డాక్టర్ నితిన్ గోర్పెడే సందర్శించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.మాధవి వారికి కళాశాలలో మౌలిక వసతులు వినూత్న బోధన పద్ధతులు అధ్యాపకుల పరిశోధన ప్రచురణలో విద్యార్థుల విజయాలు కళాశాల సమాజానికి చేస్తున్న సేవా కార్యక్రమాలు, లైబ్రరీ ల్యాబ్ రికార్డులు, కళాశాలలో ఏర్పాటు చేసిన వివిధ కమిటీల గురించి ఆమె న్యాక్ సభ్యులకు వివరించారు. అనంతరం న్యాక్ కమిటీ బృందం ఓ నివేదికను కళాశాల డైరెక్టర్‌కు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సతీష్‌కుమార్ తదితరులున్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



మల్కాజిగిరి: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, నిరంకుశ పాలనకు నిరసనగా కేంద్ర కమిటీ పిలుపు మేరకు మల్కాజిగిరిలో నిరసన చేపట్టారు. మండల కార్యదర్శి కృపాసాగర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంస్థలైన ఈడీ, సీబీఐలను ఉపయోగించుకుని ఇండియా కూటమిని బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలన్నింటినీ గమనిస్తున్నారని, పదేళ్ల కేంద్ర ప్రభుత్వ పాలనతో విసుగుచెందారని ఈసారి ఇంటికి పంపించడం ఖాయమని అభిప్రాయపడ్డారు. అనంతరం మల్కాజిగిరి కార్యాలయం వద్ద భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. కొండల్, భాస్కర్, శ్రీనివాస్, దాస్, గుప్తా, సుమిత్ర, సరోజిని తదితరులున్నారు.

కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం



మల్కాజిగిరి: మల్కాజిగిరి లక్ష్మీసాయి గార్డెన్స్‌లో జరిగిన మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సునీతామహేందర్‌రెడ్డి గెలుపునకు మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో కృషి చేస్తామన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంకు సత్కారం



గౌతంనగర్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆర్ఆర్ బిల్డర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్ అధినేత ఆర్.శ్రీనివాస్ శనివారం రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంను కలిసి పుష్పగుచ్ఛం అందచేసి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజాపాలనతో తెలంగాణలో ప్రజాస్వామ్యం పునర్నిర్మించబడుతుందన్నారు. కార్పొరేషన్ ద్వారా వెనుకబడిన ఎస్సీలకు చేయూతనిందించాని కోరారు. రాజేష్ తదితరులున్నారు.

శుభాకాంక్షలు

మల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతం జన్మదినాన్ని పురస్కరించుకుని టీపీసీసీ ఎస్సీసెల్ కన్వీనర్ హెచ్ఆర్ మోహన్ మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పీజీ.సుదర్శన్, బండారి రఘు, కొంగరి కుమార్, మహేందర్, మల్లికార్జున్ లలిత్ తదితరులున్నారు.

ఆకట్టుకున్న భరత నాట్యం



రామంతాపూర్/ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఎంపీ థియేటర్స్‌లో చైతన్య నటరాజ కళాకేంద్రం గురువు ప్రియాంక శిష్య బృందం నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన జరిగింది. చైతన్య లేఖ్య, శ్రీణిక, హరిణి, ధనుశ్రీ, అద్య, భావిక, వేదన్య తదితరులు ప్రదర్శించిన భరతనాట్యం ఆహూతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకటేశ్వర్లు, కిషోర్, హాజరై కళాకారులను అభినందించారు.

ఆరు గ్యారంటీలను సద్వినియోగం చేసుకోవాలి

మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి, చిత్రంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి, హాజరైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

గౌతంనగర్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మల్కాజిగిరిలోని లక్ష్మీసాయి గార్డెన్‌లో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు, నాయకుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరిలో భారీ మెజారీతో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మల్కాజిగిరి బీ–బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్‌యాదవ్, అల్వాల్ సర్కిల్ ఏ–బ్లాక్ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, కార్పొరేటర్లు రాజ్ జితేంద్రనాథ్, ప్రేమ్‌కుమార్, సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి..

మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించుకోవాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. దీనికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేసి, పార్టీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఇంటికి చేరేలా చూడాలని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు..

గౌతంనగర్: మల్కాజిగిరి సర్కిల్‌కు చెందిన సీనియర్ నాయకులు బోనగిరి సురేష్‌యాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం మల్కాజిగిరి లక్ష్మీసాయి గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా సురేష్‌యాదవ్‌కు వారు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వివరించారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న సురేష్‌యాదవ్

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



సైన్స్ ప్రదర్శనను ప్రారంభించి, వివరిస్తున్న ఐఐసీటీ సైంటిస్టు రమేష్

ఉప్పల్ : ఉప్పల్ చిలుకానగర్ రోడ్డులోని గణేష్ నగర్‌లో ఉన్న సర్ మౌంట్ స్కూల్ శనివారం విద్యార్థులచే నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ అతిథులను ఆలోచింపజేసింది. చిన్నారులు చేసిన ప్రయత్నాలు పెద్దలను ఆలోచింపజేశాయి. ముఖ్యంగా మనిషి గుండె పనిచేసే తీరు, డయాలసిస్, వ్యర్థ పదార్థాల ద్వారా విద్యుత్ తయారీ, ప్లాస్టిక్ నిషేధం లాంటి ఎన్నో ప్రదర్శనలు అబ్బుర పరిచాయి. రైతులను ఆకర్షించేలా వ్యవసాయ ఉత్పత్తుల్లో క్రిమి సంహారక మందుల నిషేధం లాంటి అంశాలను కూడా విద్యార్థులు తట్టడం వారి మేధస్సుకు పదును పెట్టడమేనని పలువురు అభిప్రాయపడ్డారు. విద్యార్థులచే నిర్వహించిన ప్రతీ ప్రయత్నం ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా ఐఐసీటీ సైంటిస్టు రమేష్ హాజరై, విశిష్ట అతిథిగా పాల్గొన్న ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డితో కలిసి కలిసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. సైన్స్ నిత్య జీవితంలో ముఖ్య భాగమని సైన్స్ లేనిది ప్రపంచం లేదన్నారు. ఇదే విషయాన్ని విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శన ద్వారా చూపించారన్నారు. అనంతరం పాఠశాల చైర్మన్ విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో తొలిసారిగా 80 సెంటిమీటర్ల డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేసిన ఏకైక స్కూల్ అన్నారు. విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ట్రస్మా ప్రెసిడెంట్ నాగరాజు, ఉపాధ్యాయ బృదం తదితరులున్నారు.

హోలీ సంబురాలు..

బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు హోలీ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు మాట్లాడుతూ.. హోలీ వేడుకలను ప్రశాంతమైన వాతావరణంలో కెమికల్స్ లేని రంగులతో నిర్వహించుకోవాలని సూచించారు. నూతనంగా మార్కెట్‌లోకి వస్తున్న కెమికల్స్ కలర్స్ వల్ల ప్రమాదం పొంచి ఉందని, వాటిని ఎవరూ వాడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మల్కాజిగిరి సీటు ఖచ్చితంగా గెలవాలి

పార్టీ నాయకులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశా నిర్దేశం



సాక్షి, మేడ్చల్ జిల్లా: కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్ స్థానమైన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఖచ్చితంగా గెలిచి తీరాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నగరంలోని సీఎం నివాసంలో శనివారం పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డితో కలిసి మల్కాజిగిరి, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో విజయాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. దేశంలోనే అతి పెద్ద నియోజకవర్గమైన మల్కాజిగిరి మినీ భారత్‌గా పేరొందిందన్నారు. ఇక్కడ అన్ని ప్రాంతాల ప్రజలతో పాటు ఉపాధి కోసం వలస వచ్చిన కుటుంబాలు అనేకం ఉంటాయన్నారు. నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలందర్నీ కలిసి ఓట్లు అభ్యర్థించాలన్నారు. ప్రధానంగా మేడ్చల్, మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గాల్లో అత్యధిక ఓటర్లను కలవడంతో పాటు వారి మద్దతు కూడగట్టుకొనేందుకు తీవ్రంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని సంబంధిత ఇన్‌చార్జ్‌లను కోరారు. పారిశ్రామిక ప్రాంతంగా విరాజిల్లుతున్న మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే.. ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీ విజయబావుట ఎగుర వేయాల్సిందేనన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌గా పట్నం సునీతా మహేందర్‌రెడ్డి ప్రజలందరికీ సుపరిచితమేనని పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్‌గా ప్రజలకు అనేక సేవలు అందించారని, ఎంపీగా గెలిపిస్తే.. నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి మరింత కృషి చేసే అవకాశం లభిస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

14న ఉచిత మెగా బ్రాహ్మణ వివాహ వేదిక

మల్కాజిగిరి: కాప్రా నగర బ్రాహ్మణ సేవా సమాఖ్య 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఏప్రిల్ 14న ఉచిత మెగా బ్రాహ్మణ వివాహ వేదికను ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు ఓఎస్ఆర్ శర్మ, రాంబాబు, కెకెబీఏ శర్మ తెలిపారు. శనివారం ఆనంద్‌బాగ్‌లో ఈ సందర్భంగా కరపత్రాన్ని విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ఇప్పటివరకు రూ.3 లక్షలు పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశామన్నారు. 25 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఈ వివాహ వేదికతో 5000ల మంది ఒక్కటయ్యారన్నారు. వివరాలకు www.kalyaanavedika.co.in లేదా 9985795760.

ప్రత్యేక పూజలు



మల్కాజిగిరి: మల్కాజిగిరి మారుతీనగర్‌లోని ఆంజనేయస్వామి దేవాయంలో శనిత్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూల విరాట్‌కు అభిషేకం, అలంకరణ, అర్చన పూజా కార్యక్రమాలు జరిపామని అర్చకులు శ్యామ్‌ప్రసాద్‌శర్మ ప్రకటించారు.

కార్పొరేటర్ పర్యటన



సమస్యలపై చర్చిస్తున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: అల్వాల్ డివిజన్ వెంకటరమణ కాలనీలో శనివారం కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో కమ్యూనిటీహాల్ పూర్తి, సీసీ రోడ్డు, పారిశుద్ధ్యం వంటి పలు అంశాలపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. మల్లేష్‌గౌడ్, సందీప్, అరుణ్, సంజీవ్‌రెడ్డి, నరేందర్, రాకేష్, కాలనీ అధ్యక్షుడు కిషోర్, సుధాకర్ తదితరులున్నారు.

సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి



గౌతంనగర్: సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి కలుగుతుందని మాజీ సైనికుడు పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం రాజానగర్ కాలనీలోని ఆయన నివాసంలో పలువురు పేద మహిళలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. స్థానిక మహిళలు తదితరులున్నారు.

అన్ని విధాలుగా అభివృద్ధికి కృషి చేస్తా

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల్లో గెలిపిస్తే మల్కాజ్‌గిరి పార్లమెంట్‌ను అని విధాలుగా అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం నాచారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీతోనే మల్కాజిగిరి పార్లమెంట్ అభివృద్ధి చెందుతుందన్నారు. కలిసి కట్టుగా అందరూ కలిసి భారీ మెజార్టీతో రాగిడిని గెలుపించుకుందామనిఈ ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. బూత్‌స్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేద్దామన్నారు. విజయం కోసం సోషల్ మీడియా కుడా విస్తృతంగా పనిచేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, కార్పొరేటర్లు శాంతి సాయిజెన్‌శేఖర్, పన్నాల దేవేందర్‌రెడ్డి, బన్నాల గీతా ప్రవీణ్‌ముదిరాజ్, ప్రభుదాస్, సింగిరెడ్డి శ్రీరిషా సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పెద్దచెరువు (మినీట్యాంక్‌బండ్)లో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో దోమల బెడద అధికంగా ఉందని బీఆర్ఎస్ నేతలు కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శనివారం 19వ డివిజన్ పరిధి కాలనీల బీఆర్ఎస్ నాయకులు అలువాల దేవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్‌ను కలిశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన వెంటనే డ్రోన్ సాయంతో దోమల మందును పిచికారీ చేయించి, ఓపెన్ నాళాలు, స్లాబుల కింద పెరుకుపోయిన మట్టిని వెంటనే తొలగించి శుభ్రం చేయించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వివిధ కాలనీల ప్రెసిడెంట్లు, జనరల్ సెక్రటరీలు, ఆర్గనైజర్లు, సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కామ దహనానికి ఏర్పాట్లు



రామంతాపూర్ నెహ్రూనగర్‌లో..

రామంతాపూర్: ప్రతిఏటా పాల్గుణమాసం పౌర్ణమి రోజున రాత్రి హోలీ పండుగ కంటే ముందురోజు నిర్వహించే కామదహనం కోసం ఉప్పల్ సర్కిల్‌లోని రామంతాపూర్ ఉప్పల్, హబ్సిగూడ, చిలుకానగర్ డివిజన్‌లోని బస్తీలు, కాలనీ, చౌరస్తాల వద్ద అంతర్గత రోడ్లలో పెద్దఎత్తున కట్టెలు, పిడకలను పేర్చి దాని మధ్యలో కాముని దిష్టిబొమ్మను పెట్టి ఆదివారం రాత్రి దహనం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. దేశంలోని అన్ని ప్రాంతాల్లో చిన్న, పెద్ద, ఆడ, మగ పేద, ధనిక తారతమ్యం లేకుండా ప్రతి ఏటా పాల్గుణ మాసంలో నిర్వహించే హోలీ పండుగలో హోలీ పండుగ కంటే ముందు పౌర్ణమి రోజు నిర్వహించే కామ దహనం కాముని పున్నమి అని పిలవబడే పర్వదినాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. భౌతిక కామ వాంఛలన్నీ దహనం చేసి ధర్మబద్ధమైన జీవితం కొనసాగించాలని పరమార్థాన్ని ఈ కామదహనం సూచిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు. పురాణ గ్రంథాల అనుసారం పరమ శివుడు తపస్సులో మునిగి ఉండగా.. శివుడి మనస్సు పార్వతిదేవిపై మళ్లించేందుకు మన్మథుడు పూలబాణం వేసేసరికి శివుడు ఆగ్రహంతో తన మూడో కన్నుతో మన్మథుడిని భస్మం చేసినట్లు తెలుస్తుందని పండితులు , పురోహితులు చెబుతున్నారు. భస్మీ పటలమైన మన్మథుడిని తిరిగి బతికించాలని మన్మథుడి సతీమణి రతిదేవి, శివున్ని వేడుకొనగా.. శరీరం లేకుండా ప్రతి మనిషిలో సజీవంగా కోరికల రూపంలో ఉండేలా శివుడు అనుగ్రహించినట్లు వారు పేర్కొంటున్నారు. శివుడు కాముడిని భస్మీపటం చేయడంలో ఒక సందేశం కనబడుతుందని ప్రతి మనిషిలో అదృశ్య రూపంలో అంతర్గతంగా చెడు కోరికలు దాగి ఉంటాయని వాటిని దహనం చేసుకుని మానసిక శారీరక ఆనందాన్ని పొందుతూ.. ఆత్మస్థైర్యంతో మంచి దారిలో నడిచి అందరికీ మంచి చేస్తూ.. జీవించాలనే సందేశం దాగి ఉందని వారు వివరించారు.

సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయం

ఘనంగా భగత్‌సింగ్,రాజ్‌గురు,సుఖదేవ్‌ల వర్ధంతి



బోడుప్పల్: స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు నడవాలని భగత్‌సింగ్ యువజన మండలి అధ్యక్షులు సాయి నినవీన్‌కుమార్ అన్నారు. బోడుప్పల్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం స్వాతంత్ర సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. నేటి యువత స్వాతంత్ర సమరయోధుల పోరాటాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు నడవాలన్నారు. సభ్యులు సాయికుమార్, వినీత్, గణేష్, నవీన్, ఆనంద్, చందు, నరేష్ తదితరులున్నారు.

ప్రాణాలు సైతం తృణప్రాయంగా..

అల్వాల్: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసి ప్రాణాలు సైతం తృణప్రాయంగా అర్పించిన విప్లవ వీరులు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల వర్ధంతిని తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో అల్వాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ జన సమితి మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏర్పుల దయాకర్, ఉపాధ్యక్షులు రెడ్డిపల్లి శ్రీనివాస్, విష్ణుమూర్తి, ప్రభునాథ్, సుధాకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని వినతి

ఘట్‌కేసర్: ఎఫ్ఎస్‌సీఎస్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆ సంఘం డైరెక్టర్ ధర్మారెడ్డి జిల్లా సహకార అధికారికి శనివారం వినతి అందజేశారు. సర్వసభ సమావేశానికి రాజకీయ నాయకుల ముసుగులో వచ్చే వారిని ఆపాలని, వ్యవసాయ భూమి లేకుండానే సభ్యత్వం పొందిన వారిని అనర్హులుగా ప్రకటించాలని, విక్రయించిన భూమిని తాకట్టుపెట్టి రుణం పొందిన వారు, బినామీ రుణం తీసుకున్న వారిపై విచారణ జరపాలని, పాలక మండలి సభ్యుల కుటుంబ సభ్యులను అక్రమంగా ఉద్యోగులుగా నియమించిన వారిపై శాఖపరమైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

8న హైదరాబాద్ సభకు మాలలు తరలిరావాలి



మాట్లాడుతున్న జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్

ఘట్‌కేసర్: పేద, ధనిక వర్గాల మధ్య దూరం రోజురోజుకూ పెరుగుతోందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. ఎన్ఎఫ్‌సీనగర్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం నిర్వహించిన జాతీయ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చాలనే శక్తులను నిర్వీర్యం చేసేందుకు వచ్చేనెల 2న మాల మహానాడు ఆధ్వర్యంలో రాజ్యాంగ రక్షణ యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యాత్ర కొనసాగుతుందని, ఏప్రిల్ 8న హైదరాబాద్‌లో ముగియనున్న సభకు పెద్ద ఎత్తున మాలలు హాజరై విజయంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్, వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, మండల అధ్యక్షుడు మల్లేశ్, ప్రధాన కార్యదర్శి మురళి, దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షుడు పరుశురాం పాల్గొన్నారు.